## క్లుప్తంగా

### కొనసాగుతున్న ఈసెట్ కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

నంగునూరు(సిద్దిపేట): రాజగోపాల్‌పేట పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన ఈసెట్ కౌన్సెలింగ్‌కు 176 మంది విద్యార్థులు హాజరయ్యారు. అధికారులు ఒరిజినల్ సర్టిఫికెట్లను పరిశీలించి లాగిన్‌ఐడీ, పాస్‌వర్డు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు ఈనెల 14వ తేదీ వరకు కళాశాల కోసం వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాలన్నారు

### అగ్నివీరులకు సన్మానం





శిక్షణ పొందిన విద్యార్థులను సన్మానిస్తున్న అధ్యాపకులు

సిద్దిపేట ఎడ్యుకేషన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అగ్నిపథ్ శిక్షణకు 11 మంది ప్రభుత్వ డిగ్రీ విద్యార్థులు ఎంపికయ్యారు. సైనిక శిక్షను పూర్తి చేయడంతో మంగళవారం కళాశాలలో వారిని అధ్యాపకులు సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ప్రసాద్, డాక్టర గోపాల సుదర్శన్, డాక్టర్ అయోధ్యరెడ్డి, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని కేజీబీవీలో హెడ్ కుక్‌పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో సునీత మంగళవారం తెలిపారు. పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్ హబ్ ఆవరణలోగల కేజీబీవీలో తాత్కాలిక ప్రాతిపదికన పనిచేసేందుకు 7వ తరగతి చదివిన స్థానిక మహిళ 400 మందికి వంట చేయగల సామర్థ్యం, అనుభవం కలిగి ఉండాలన్నారు. ఆసక్తి గల మహిళలు కేజీబీవీలో ఈనెల 12 నుంచి 18 వరకు దరఖాస్తుతో పాటు పాస్‌పోర్ట్ సైజు ఫొటో, ఆధార్‌కార్డు, అనుభవ ధ్రువ పత్రాలు జతపరిచి పాఠశాలలోని ప్రత్యేకాధికారికి ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటలలోగా అందజేయాలన్నారు. ఇంటర్వ్యూ, డెమో నిర్వహించి ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. వివరాలకు కేజీబీవీలో సంప్రదించాలన్నారు.

### పాఠశాల భవనం నిర్మించాలి

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం పోతారం జ్యోతిరావు పూలే బీసీ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల అద్దె భవనంలో కొనసాగుతోందని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జేరిపోతు జనార్ధన్ అన్నారు. మంగళవారం హుస్నాబాద్‌లో విలేకర్లతో మాట్లాడుతూ ఏడాది నుంచి బీసీ గురుకుల కళాశాలలో ప్రవేశాలు తీసుకొని ఇక్కడ తరగతి గదులు లేక వర్గల్ బీసీ హాస్టల్‌కు పంపిస్తున్నారని ఆరోపించారు. బీసీ గురుకుల కళాశాలలో చేరినా తరగతి గదుల కొరతతో విద్యార్థులను దూరం ప్రాంతాలకు తరలించడంతో పిల్లల తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి బీసీ గురుకుల భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. మంత్రి స్పందించకపోతే గురుకుల పాఠశాల వర్గల్‌కు తరలిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

### విద్యుత్ స్తంభాల తరలింపు పరిశీలన



స్తంభాలను పరిశీలిస్తున్న డీఈ శ్రీనివాసులు

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలో జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా చేపట్టిన విద్యుత్ స్తంభాల తరలింపు పనులను మంగళవారం విద్యుత్ శాఖ డీఈ శ్రీనివాసులు పరిశీలించారు. మున్సిపల్ చైర్ పర్సన్ అంకుగారి స్వరూపరాణితో కలిసి పట్టణంలో పర్యటించారు. డ్రెయిన్ పనుల్లో అడ్డుగా ఉన్న స్తంభాలను తొలగించి అనువైనచోట వేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఏడీఈ రత్నాచారి, ఏఈ తబ్రీచ్, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, కౌన్సిలర్ ఆడెపు నరేందర్ తదితరులున్నారు.

### ఇసుక డంప్ సీజ్

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపును సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, మిరుదొడ్డి పోలీసులు మంగళవారం సీజ్ చేశారు. మండల కేంద్రమైన మిరుదొడ్డి శివారులో ఉన్న చంద్రశేఖర్ పౌల్ట్రీ ఫామ్ వద్ద గ్రామానికి చెందిన మొగుళ్ల మల్లేశం ప్రభుత్వ అనుమతులు లేకుండా సుమారు 20 టన్నుల ఇసుకను నిల్వ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు, మిరుదొడ్డి ఎస్‌ఐ బోయిని పర్శరాములు తెలిపారు. ఇసుక డంపును సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు. ఇసుకను నిల్వ చేస్తే చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

# నాటుతూ.. నాటిస్తూ

- పదో హరితహారానికి మొక్కలు సిద్ధం
- ఒక్కో నర్సరీ నుంచి 5 వేల మొక్కలు
- మొక్కల పెంపకాన్ని పర్యవేక్షిస్తున్న అధికారులు



కోహెడ గ్రామ పంచాయతీలోని నర్సరీలో సిద్ధంగా ఉన్న మొక్కలు

రాష్ట్రాన్ని పచ్చదనంతో నింపేందుకు ఏటా ప్రభుత్వం చేపడుతున్న హరితహారం కార్యక్రమానికి రంగం సిద్ధమైంది. ఏటా వర్షాకాలం ప్రారంభంలో మొక్కలు విరివిగా నాటుతూ పర్యావరణాన్ని కాపాడేందుకు గ్రామ పంచాయతీలు కృషి చేస్తున్నాయి. పదో హరితహారం కోసం ఏటా గ్రామంలో మొక్కలు నాటేందుకు సర్వం సిద్ధం చేశారు. జామ, మామిడి, ఉసిరి, దానిమ్మ, నేరేడు, టేకు తదితర పది రకాల మొక్కలు అందుబాటులో ఉన్నాయి. ప్రతీ ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటేలా కృషి చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

కోహెడ(హుస్నాబాద్):/అక్కన్నపేట(హుస్నాబాద్): ఇంటింటికి పండ్ల మొక్కలు పంపిణీ చేసేందుకు గ్రామ పంచాయతీలు కార్యాచరణ చేపట్టాయి. ప్రతీ గ్రామంలో ఇంటి నిర్మాణం చేపట్టేవారికి పండ్ల మొక్కలు అందించనున్నారు. మొక్కలు నాటేందుకు సరిపడా వర్షపాతం నమోదు తర్వాత పంపిణీ చేయడం మంచిదని అధికారులు భావిస్తున్నారు. ఇటీవల ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని బాడుగుల చెర్వు వద్ద ఈజీఎస్ కూలీలతో 700 మొక్కలు నాటినట్లు అధికారులు తెలిపారు.

**అక్కన్నపేట మండలంలో..**

మండలంలో మొత్తం 31 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీలో నర్సరీలను ఏర్పాటు చేశారు. మండల అభివృద్ధి శాఖ ఈ నర్సరీలను పర్యవేక్షిస్తోంది. ఒక్కో నర్సరీలో 5 వేల మొక్కలు పెంచుతున్నారు. ప్రభుత్వ స్థలాలు, కార్యాలయాలు ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటేందుకు చర్యలు చేపట్టారు.

**95 వేల మొక్కల లక్ష్యం**

వర్షాలు కురుస్తుండటంతో ఈనెల చివరికల్లా హరితహారం కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. గతేడాది 1.17 లక్షలు, ఈ ఏడాది 95 వేల మొక్కలు నాటడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ మేరకు 31 గ్రామాల్లోని నర్సరీల్లో పెంచిన మొక్కలను సిద్ధంగా ఉంచారు.

### బాధ్యతగా మొక్కలు నాటాలి



గ్రామంలో మొక్కలు నాటేందుకు పంచాయతీ పరిధిలో ఐదువేల మొక్కలు సిద్ధంగా ఉంచాం. సరిపడా వర్షపాతం నమోదైన వెంటనే ఇంటికి ఐదు పండ్ల మొక్కలు పంపిణీ చేస్తాం. గ్రామస్తులు బాధ్యతగా ఏటా ఐదు మొక్కలు నాటడం అలవాటు చేసుకోవాలి.

– భుక్య దేవేందర్ రాథోడ్, కార్యదర్శి కోహెడ జీపీ

### అన్ని ఏర్పాట్లు చేశాం



హరితహారానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఇంటింటికి రెండు, మూడు మొక్కలు అందించనున్నాం. వైకుంఠ ధామాలు, ప్రభుత్వ స్థలాల్లో నాటేలా ప్రణాళిక రూపొందించాం. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాగానే మొక్కలు నాటే ప్రక్రియను ప్రారంభిస్తాం.

– ప్రభాకర్, ఏపీఓ ఉపాధి హామీ, అక్కన్నపేట మండలం

# మిషన్ భగీరథ ఇంటింటి సర్వే



మల్లంపల్లిలో ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ జయరాం

అక్కన్నపేట(హుస్నాబాద్): మిషన్ భగీరథ పథకంపై ప్రభుత్వం ఇంటింటి సర్వే చేపట్టింది. అక్కన్నపేట మండలంలో ఎంపీడీఓ భానోతు జయరాం పర్యవేక్షణలో సర్వే కొనసాగుతోంది. మంగళవారం మండలంలోని మల్లంపల్లి, మోత్కుపల్లి, కట్కూర్, పెద్దతండా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు చేస్తున్న భగీరథ ఇంటింటి సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగీరథ పథకంలో ఏర్పాటు చేసిన ఇంటింటి నల్లాల పరిస్థితిపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. ప్రస్తుతం గ్రామాల్లో ప్రతీ ఇంటికి నల్లా ఉందా, ఉంటే నీరు సక్రమంగా వస్తోందా, సరఫరా చేస్తున్న నీరు కుటుంబానికి సరిపోతుందా, పైపులైన్ల లీకేజీలు ఉన్నాయా, కొత్త ఇళ్లకు నల్లా కనెక్షన్ ఉన్నదీ లేనిది వివరాలు తెలుసుకోవడానికి ప్రభుత్వం ఇంటింటి సమగ్ర సర్వే చేపట్టిందన్నారు. సర్వే పక్కాగా నిర్వహించాలని కార్యదర్శులను ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సతీష్, కార్తీక్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీ 11 కేవీ విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సిద్దిపేట పట్టణ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. నాయకం నగర్, ప్రియదర్శిని నగర్, హౌసింగ్‌బోర్డు కాలనీ, టీచర్స్ కాలనీ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలన్నారు.

**11 కేవీ ఫీడర్ల పరిధిలో..**

వర్గల్(గజ్వేల్): 11 కేవీ ఫీడర్ల పరిధిలో బుధవారం మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా ఉండదని, వర్గల్ మండల ట్రాన్స్‌కో ఏఈ సంతోష్‌కుమార్ తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 వరకు శేరిపల్లి, మక్త మైలారం, సీతారాంపల్లి, బొర్రగూడెం, చందాపూర్ గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

**పాత పెట్రోల్ బంక్ ప్రాంతంలో..**

చేర్యాల(సిద్దిపేట): పట్టణంలోని 4, 5 వార్డుల పరిధిలోని పాత పెట్రోల్ బంక్ ప్రాంతంలో బుధవారం విద్యుత్ సరఫరా ఉండదని పట్టణ ఏఈ తబ్రీచ్ తెలిపారు. పట్టణ కేంద్రంలో జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా ఉదయం 8 నుంచి 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

**గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో..**

గజ్వేల్‌రూరల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్‌శాఖ ఏఈ మారుతి తెలిపారు. పట్టణంలోని బాలాజీ ఎన్‌క్లేవ్, సిరి ఎన్‌క్లేవ్, లక్ష్మీప్రసన్నకాలనీ, కోర్టు పరిసర ప్రాంతాలతో పాటు టీవీఎస్ గల్లీ, శివాలయం వీధి ప్రాంతాల్లో ఉదయం 6 నుంచి 8.45 గంటల వరకు, అదే విధంగా సంతోష్ థియేటర్, రాజిరెడ్డిపల్లి, బీడీ కాలనీ, ధనలక్ష్మీ కాలనీ, మహతి స్కూల్ ఏరియాతో పాటు పిడిచెడ్ రోడ్డు మార్గంలో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించాలన్నారు.

# రెడ్డి కార్పొరేషన్ చైర్మన్‌గా బద్దూరిని నియమించాలి



బెజ్జంకిలో మాట్లాడుతున్న రత్నాకర్‌రెడ్డి

బెజ్జంకి(సిద్దిపేట): / సిద్దిపేట కమాన్: రెడ్ల ఐక్యతకు, కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్న బద్దూరి వెంకటేశ్వరరెడ్డిని రెడ్డి కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించాలని రెడ్డి జేఏసీ జిల్లా ఉపాధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి ప్రభు త్వాన్ని కోరారు. బెజ్జంకిలో రెడ్డి జేఏసీ నాయకులు మంగళవారం సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించాలని కోరుతూ వెంకటేశ్వర్‌రెడ్డికి మద్దతివ్వాలని ఏకగ్రీవ తీర్మానం చేశారు. అనంతరం వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి సహకరించే వారికి బాధ్యతలివ్వాలన్నారు. సమావేశంలో యూత్ సంఘం మండల అధ్యక్షుడు చెన్నారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ఒంటెల సంపత్‌రెడ్డి, జంగిటి సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత పుస్తకాల పంపిణీ



పాఠ్యపుస్తకాలను అందజేస్తున్న మండల నోడల్ అధికారి రంగానాయక్

హుస్నాబాద్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాం అందించినట్లు ఇన్‌చార్జి ఎంఈఓ దేశిరెడ్డి మంగళవారం తెలిపారు. పాఠశాలల పునఃప్రారంభంతో ఉపాధ్యాయులు పాఠశాలలకు వెళ్లి విద్యార్థులను పాఠశాలలకు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల నిర్వహణ, మైనర్ మరమ్మతులు త్వరగా పూర్తి చేయించాలన్నారు.

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు పాఠ్యపుస్తకాలను మంగళవారం మండల నోడల్ అధికారి రంగానాయక్ ఆధ్వర్యంలో అందజేశారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు.

# ఐదు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్న పోలీసులు

నంగునూరు(సిద్దిపేట): ఇసుకను అక్రమంగా రెండు ట్రాక్టర్లలో రవాణా చేస్తున్నారు. సమాచారం తెలియడంతో మంగళవారం తెల్లవారు జామున సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, రాజగోపాల్‌పేట పోలీసులు వాటిని పట్టుకున్నారు. అక్కెనపల్లి పెద్దవాగు నుంచి ఇసుక రవాణా చేస్తున్నారనే సమాచారం తెలియడంతో తెల్లవారు జామున పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఖాత గ్రామానికి చెందిన అల్లెపు అనిల్, చామంతుల రాజయ్యకు చెందిన ట్రాక్టర్లలో ఇసుకను రవాణా చేస్తున్నట్లు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

చేర్యాల(సిద్దిపేట): అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించినట్లు ఆర్ఐ రాజేందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ నంగునూరు మండలంలోని ఖాత నుంచి పట్టణ కేంద్రానికి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని సోమవారం రాత్రి అందిన సమాచారం మేరకు తనిఖీలు చేపట్టామన్నారు. ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను గుర్తించి వాటిని సీజ్ చేసి తహసీల్దార్ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు.

**ఇసుక వేలం**

ఇటీవల మండల పరిధిలోని కమలాయపల్లి శివారులో సీజ్ చేసిన 15 ట్రాక్టర్ల ఇసుకను బుధవారం ఉదయం 11 గంటలకు తహసీల్దార్ కార్యాలయంలో వేలం నిర్వహిస్తున్నట్లు ఆర్ఐ తెలిపారు.

### ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

బెజ్జంకి(సిద్దిపేట): ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని బెజ్జంకి క్రాసింగ్‌లో సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల కోసం ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు త్వరలో మంజూరు చేస్తామన్నారు. సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని ఇచ్చినందుకు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్‌ను అభినందించారు.

### యాత్రికులకు భోజన వసతి

సిద్దిపేటకమాన్: అమర్నాథ్ యాత్ర చేసే భక్తులకు భోజన వసతి కల్పించడం తమ పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నామని అమర్నాథ్ అన్నదాన సేవా సమితి అధ్యక్షుడు కొర్తివాడ లక్ష్మణ్ అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో సభ్యులు మాట్లాడారు. అమర్నాథ్ యాత్ర ఎంతో పవిత్రమైందన్నారు. అమర్నాథ్ సేవా మండలి అమృతసర్ సహకారంతో బాల్తాల్ వద్ద, అలాగే భోలే బండారి చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో పంచతరణి వద్ద ప్రత్యేక లంగర్లు ఏర్పాటు చేసి భోజన వసతి కల్పిస్తున్నామన్నారు. భోజనం తయారీ సరుకుల లారీలు ఈనెల 12వ తేదీన సిద్దిపేట శరబేశ్వర ఆలయం నుంచి బయలుదేరుతాయని తెలిపారు. ఎమ్మెల్యే హరీశ్‌రావు జెండాఊపి ప్రారంభిస్తారన్నారు. సమావేశంలో నేతి కైలాసం, గ్యాదరి పరమేశ్వర్, మధు సూదన్, రమేష్, భూపతి పాల్గొన్నారు.

### బడిబాట

దుబ్బాకటౌన్: మండల పరిధిలోని లింగాయపల్లి తండా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు మంగళవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో కలిసి ర్యాలీ తీశారు. ప్రభుత్వ పాఠశాలలో ఉచిత యూనిఫామ్, పాఠ్యపుస్తకాలు, నోటు బుక్కులు, ఆంగ్లంలో విద్యాబోధన అందిస్తున్నట్లు తల్లిదండ్రులకు వివరించారు. తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలన్నారు.

### జోరువాన

మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డి మండలంతో పాటు, అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో మంగళవారం సాయంత్రం జోరువాన కురిసింది. దీంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఎండలతో ఇబ్బంది పడ్డ జనానికి కాస్త ఉపశమనం లభించినట్లయింది. గంటపాటు దంచి కొట్టిన వానతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. పంటల సాగుకు అన్ని సిద్ధం చేసుకుంటున్నారు.

# ఎమ్మెల్యే బహిరంగ క్షమాపణ చెప్పాలి

కాంగ్రెస్ నాయకుల డిమాండ్



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

హుస్నాబాద్: బూడిద లారీల తరలింపులో మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అసత్య ఆరోపణలు చేస్తున్న హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ బూడిద లారీల తరలింపు వెనుక మంత్రి హస్తం ఉందని కౌశిక్ రెడ్డి ఆరోపణలు చేయడం సరికాదన్నారు 32 టన్నులతో వెళ్లాల్సిన లారీలు 72 టన్నుల లోడ్‌తో బూడిదను తీసుకెళ్తున్నారని తప్పుడు వే బిల్ చూపెడుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. బూడిద లారీల తరలింపు విషయంలో మంత్రికి సంబంధం లేదన్నారు. బీఆర్ఎస్ పార్టీని ప్రజలు గుర్తించడం లేదని, కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుల మెప్పు పొందేందుకే కౌశిక్ రెడ్డి మంత్రిపై అసత్య ఆరోపణలు చేస్తున్నాడన్నారు. సమావేశంలో హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు బంక చందు, జంగపల్లి అయిలయ్య, కౌన్సిలర్ వల్లపు రాజు, నాయకులు కుమార్, బాలయ్య, అనిల్, శ్రీకాంత్, శ్రీనివాస్, హరీశ్‌బాబు తదితరులు ఉన్నారు.

# ఉనికి కోసమే ఎంపీపీ ఎత్తుగడ

వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు



మాట్లాడుతున్న పోలీస్ రాజులు

మిరుదొడ్డి(దుబ్బాక): తన ఉనికిని చాటుకోవడానికే మిరుదొడ్డి ఎంపీపీ గజ్జెల సాయిలు ఎత్తుగడలు వేస్తున్నాడని వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు చాట్లపల్లి బాలమల్లేశం గౌడ్ విమర్శించారు. మంగళవారం మిరుదొడ్డిలో వారు మాట్లాడుతూ మండల అభివృద్ధిపై ఎన్నడూ స్పందించని ఎంపీపీ ఎంపీటీసీలను విమర్శించడమే పనిగా పెట్టుకున్నాడన్నారు. ఈ నెల 13న నిర్వహించే అవిశ్వాస తీర్మానంతో ఎంపీపీని గద్దెదింపుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సూకూరి లక్ష్మీ, మిరుదొడ్డి, కాసులాబాద్, ఖాజీపూర్, అందె ఎంపీటీసీలు ధర్మారం చిన్నలక్ష్మీ, కీసరి రాజవ్వ, భాగ్యలక్ష్మీ, దండబోయిన లలిత, తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు



ఆలయ ఆవరణలో పట్నాలు

శ్రీరేణుకా ఎల్లమ్మ జాతర చివరి మంగళవారం కావడంతో భక్తులు పోటెత్తారు. వివిధ మండలాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి ముడుపులు సమర్పించారు. ఒడిబియ్యం, బోనాలు, పట్నాలు వేసి మొక్కులు తీర్చుకున్నారు. పంబాల పూజారులు ఎల్లమ్మ కథ వినిపించారు. అలాగే పోచమ్మ దేవాలయానికి మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

– హుస్నాబాద్

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మూడు దశాబ్దాల క్రితం చదువుకున్న విద్యార్థులు మంగళవారం కలుసుకున్నారు. లచ్చపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 1993–94 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా పాఠశాలలో కలుసుకోవడంతో సందడిగా మారింది. చిన్ననాటి సంగతులు గుర్తు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు.

– దుబ్బాకటౌన్

## సంక్షిప్త వార్తలు

**◆ విద్యార్థికి అభినందనలు**

చిన్నకోడూరు(సిద్దిపేట): జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో చిన్నకోడూరు గ్రామానికి చెందిన విదీప్ రెడ్డి ఆలిండియా స్థాయిలో 36వ ర్యాంక్ సాధించాడు. ఎన్ఐటీ వరంగల్ పూర్వ విద్యార్థి జాలపల్లి విజయ్‌రెడ్డి కుమారుడే విదీప్‌రెడ్డి. ర్యాంకు సాధించినందుకు అతడిని మంగళవారం బంధువులు, గ్రామస్తులు, అధ్యాపకులు అభినందించారు.

**◆ ఆ అధికారులపై చర్యలు తీసుకోవాలి**

బెజ్జంకి(సిద్దిపేట): సమయపాలన పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి బొనగిరి రూపేష్ డిమాండ్ చేశారు. బెజ్జంకి తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం విలేకరులతో మాట్లాడారు. కార్యాలయానికి వినతి పత్రం ఇవ్వడానికి వస్తే సిబ్బంది లేరని ఆరోపించారు. అధికారులు ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు మహేందర్, మధు, మహేష్ పాల్గొన్నారు.

**◆ బడిబాట గ్రామసభల నిర్వహణ**

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని శనిగరం, తంగళ్లపల్లి గ్రామాల్లో మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎంలు సరళ, పద్మ, సత్యనారాయణ మాట్లాడారు. అనుభవం, అర్హత ఉన్న ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలలో ఉన్నారన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతులున్నాయని, ఉచిత పుస్తకాలు అందజేస్తున్నట్లు తెలిపారు. తల్లితండ్రులు తమ పిల్లలను పభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. కార్యక్రమాల్లో తంగళ్లపల్లి ఎంపీటీసీ కోనె శేఖర్, శనిగరం ఎంపీటీసీ కొంపెల్లి స్వప్న, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

**◆ ఎమ్మెల్యే వ్యాఖ్యలు వక్రీకరించడం సరికాదు**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఆగస్టు 15లోగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు, రూ.2 లక్షల రుణ మాఫీ చేస్తే రాజీనామా చేస్తానని ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారని, ఈ వ్యాఖ్యలను ఆ పార్టీ నాయకులు వక్రీకరించడం సరికాదని బీఆర్ఎస్ యువజన నాయకుడు సామల్ల సాయిప్రేమ్ అన్నారు. మంగళవారం సిద్దిపేట పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హరీశ్‌రావు మాటలను వేములవాడ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ విప్ ఆది శ్రీనివాస్ వక్రీకరిస్తూ మాట్లాడారని, అవగాహనతో మాట్లాడాలన్నారు.

**◆ దేవాలయంలో పూజలు**

హుస్నాబాద్: దేవాదాయ ధర్మాదాయ శాఖ వరంగల్ జోన్ ఉప కమిషనర్ టి.శ్రీకాంత్ రావు మంగళవారం శ్రీరేణుకా ఎల్లమ్మ దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ స్థల పురాణం గురించి అడిగి తెలుసుకున్నారు. ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఆలయ కార్యనిర్వహణ అధికారి కిషన్ రావు, ఆలయ కమిటీ చైర్మన్ పూదరి లక్ష్మీనారాయణ గౌడ్ తదితరులు ఉన్నారు.